

కథ 1992

3

# చమురుబావి

ఎమ్.ఎస్. సూర్యనారాయణ

ఆ వ్యాధి ఎలా సంక్రమించిందో నేను చెప్పలేను. ఎక్కడ గాలి పీల్చినా, నాకు చమురు కంపే! చమురు కంపు మహా భయంకరంగా వుంటుంది.

ఊపిరి పీల్చడం చాలా కష్టమైపోతుంది. స్వచ్ఛమైన ఊపిరితిత్తుల నిండా చమురుకంపు చేరి ప్రాణవాయువు కలుషితమైపోతుంది.

పచ్చటి బతుకు చెట్లు కూలిపోతాయి!

చమురు కంపు ఎంతటి కల్లోలాలనైనా సృష్టిస్తుంది. అందుకే, నాకు చమురంటే భయం!

నిజానికి చమురు లేకపోతే ఏమీలేదు. ఆ సత్యాన్ని బుద్ధి వున్న వారెవరైనా ఒప్పుకుంటారు. కానీ- వెలుతురిచ్చే చమురే, చీకటిని కూడా మిగుల్చుతుందని ఒప్పుకోవాలి కదా!

ఇంతకీ నాకు జబ్బు ఎలా వచ్చిందో ఏమో కానీ-

రోజురోజుకీ అది ముదిరిపోతోంది.

ఆ సాయంత్రపువేళ గదిలో పచార్లు చేస్తూ, హఠాత్తుగా టైము చూశాను. ఆరు గంటలయ్యింది. టేబుల్ సొరుగులో వున్న వెడ్డింగ్ కార్డ్ తీసి చూశాను.

రాత్రి తొమ్మిది గంటలకే ముహూర్తం.

నా మాజీ ప్రేయసి ఇందుమతి పెళ్లి!

వెళ్లాలా వద్దా అని ప్రశ్నించుకున్నమీదట వెళ్లాలనే నిశ్చయించి బయలుదేరాను.

దుర్గ కల్యాణ మంటపం మహా హడావుడిగా వుంది.

పందిట్లోకి అడుగు పెట్టానో లేదో వాసన మొదలయ్యింది! అంతటా చమురు కంపే! ముక్కుపుటాలు ఆ కంపు భరించలేక అదిరిపోయాయి. వెనుతిరిగి పోదామనుకున్నాను ఒక్కక్షణం. కానీ... ప్రియమైన ఇందుమతి కళ్యాణం. తమాయించుకుని... ప్రేయసిని... నా కలల ఊర్వశిని చూసుకుందామని లోనికి ప్రవేశించాను.

ముక్కుకి రుమాలు గట్టిగా అదిమిపెట్టాను. లేకపోతే చాలా కష్టం! నేను డబ్బులు లేకపోయినా బయటకి నడుస్తానేమో, రుమాలు లేకుండా మాత్రం కదలనంటే కదలను!

అంతా హాయిగా అటూ ఇటూ తిరుగుతున్నారు.

నవ్వుతున్నారు. తుళ్లుతున్నారు. హాస్యాలాడుకుంటున్నారు.

కానీ - ఎవ్వరూ ముక్కు మాత్రం మూసుకోవడం లేదు!

"ఏమైపోయింది వీళ్ల ఘ్రాణజ్ఞానమంతా?' అనుకున్నాను.

"ఏం గురూ! ముక్కెందుకు మూసుకున్నావూ? ఏదైనా కంపా? లేక రొంపా?" ప్రశ్నించాడో మిత్రుడు.

"అబ్బే, రొంప కాదు! కంపే! వొట్టి చమురు కంపు. నీకు వెయ్యటం లేదూ?" అన్నాను.

నాకేసి ఎగాదిగా చూసి మారుమాటాడకుండా వెళ్లిపోయాడు అతను.

చమురు మహత్యమే అంత!

చమురంటే మజాకా కాదు. చమురు రూపాన్నీ... గుణాన్నీ.. వర్ణించడం సాధ్యం కాదు... చమురంటే సాక్షాత్తూ మిసెస్ శ్రీరంగధామేశ్వరి. కానీ- ఇప్పుడు తన రూపం మార్చుకుంది. చమురు బావిగా మారిపోయింది. లేడీస్ ఎలాగూ తనకు రిప్రజెంటేటివ్సే! అందుకే వాళ్లని ఆవహించి వుంటుంది!

"మాస్టారూ, ఎంతేవిటీ?" గుంభనంగా ప్రశ్నించాడు ఓ బట్టతలాయన. "ఏవో! ఎన్ని లీటర్లో తెలియదు! కానీ చూశారూ. ఎంత కంపో!" అన్నాను రుమాలు అదిమిపెట్టి.

అతను మారుమాటాడలేదు.

'పాపం! ముక్కు పన్చెయ్యటం లేదు కాబోలు! అందుకే వీడికి ఏ వాసనా లేదు! ముఖ్యంగా చమురు కంపు అస్సలు కొట్టదులా వుంది,' అనుకుని జాలి పడ్డాను.

టైము తొమ్మిదయ్యింది.

పెళ్లి మంత్రాల జోరు హెచ్చింది.

భజంత్రీల హోరు పెరిగింది.

వీటన్నింటి కన్నా- చమురు కంపు బాగా పేట్రేగి పోయింది! తట్టుకోవడం నావల్ల కావడంలేదు. కడుపులో తిప్పుతోంది. ఒకటే వికారం. అంతా మామూలుగా, యథావిధిగా జరిగిపోతోంది.

అంతలో ఎవరో... డ్రింక్స్ కాబోలు సర్వ్ చేశారు.

అందరికీ తలో రకం డ్రింకూను.

నాకు ఓ డ్రింక్ ఇచ్చారు. సిప్ చేశాను మెల్లగా.

సీసా సగం పూర్తయ్యిందో, లేదో డోకొచ్చేసింది! రుమాలుతో నోటిని కప్పేసి, గబగబా పరుగులాంటి నడకతో డోకును ఆపుకుంటూ వాష్‌బేసిన్ దగ్గరికి నడిచాను.

నాకిచ్చింది కూల్ డ్రింక్‌లా లేదు.

సీసాడు చమురులో స్ట్రా వేసిచ్చారు!

నాకు ఏదైతో పడదో... ఏ వాసనైతే గిట్టదో... ఆ చమురే తాగమని ఇచ్చారు!

ఈ చమురు వ్యాధి నన్ను పట్టి పీడిస్తోంది.

మనశ్శాంతి లేకుండా చేస్తోంది.

ఎక్కడ పీల్చినా ఒకటే వాసన!

భరించలేనంత చమురు వాసన!

నా ముక్కుని ఎంతమంది E.N.T. స్పెషలిస్టులకి చూపించానో లెక్కలేదు!

"బాబూ నీ ముక్కు బాగానే ఉంది! దానికి ఏ లోపమూ లేదు! నీ మనసే ఏమీ బాగున్నట్టు లేదు! వెళ్లి బాగుచేయించుకో," అనేశారు.

వాళ్ల రిపోర్ట్ మీద నాకు అస్సలు నమ్మకం లేదు!

వాళ్లంతా ఒట్టి దొంగలు. అంతా డ్రామా! బుకాయింపు సెక్షన్. ఇంతగా చమురు వాసనతో గాలి కలుషితమైపోతోంటే- అస్సలు ఏమీ లేనట్టే నటిస్తున్నారు. వీళ్ల మెదళ్లకే రిపేర్ చెయ్యాలి. మొత్తం టాపేరాలన్నీ లూజే! దిట్టంగా స్క్రూలు బిగించాలి. ముఖ్యంగా- వీళ్ల ముక్కులు సక్రమంగా వాసనలు పసికట్టే విధంగా బాగుచెయ్యాలి.

అసలు చమురు వాసన కొట్టకుండా ఎలా బతుకుతున్నారు వీళ్లంతా? అంతా పెద్ద కుట్ర!

ఆత్మద్రోహానికి విరుగుడుందా?

"అబ్బే! అలా కాదు బావగారూ! మా ఫోటోల బిల్లు కూడా మీరియ్యడమే న్యాయం. పెళ్లి మీ అమ్మాయికి అనే విషయాన్ని గుర్తుంచుకోండి! ఫోటోల చమురు మాకెందుకు వదలాలీ?"

భజంత్రీల హోరులోంచి లీలగా వినిపించాయి మాటలు. చిరాకుగా... కసిగా... వధూవరుల పైకి అక్షింతలు జల్లాను.

అప్పుడు తేరిపార చూద్దును కదా- పీటల మీద ఇందుమతి నాకంటికి ఇందుమతి లాగ లేదు!

ఇందుమతి స్థానంలో ఓ చమురు బావి వుంది!

బావిలోకి చేదవేసి, పెళ్లికొడుకు చమురు తోడుతున్నాడు.

చమురు బావికి మామూలుగా, నీటి బావికి ఉన్నట్టుగానే వరలు ఉన్నాయి. ఆ వరలకి చేతులున్నాయి. కింది భాగంలో కాళ్లున్నాయి. పెళ్లికొడుకు దర్పంగా చమురు బావి చెయ్యి పుచ్చుకుని అగ్నిచుట్టూ ప్రదక్షిణం చేస్తున్నాడు!

సాక్షాత్తూ అగ్ని చుట్టూ!

నా గుండె వేగంగా కొట్టుకోసాగింది.

పురోహితుడు అగ్నిమంత్రం చదువుతున్నాడు.

అగ్నికి నమస్కారం చేయిస్తున్నాడు.

వాళ్లు అగ్ని చుట్టూ తిరుగుతున్నారు!

మంటలు ఎగదన్నుతున్నాయి.

ఇంకేమయినా ఉందా? మంట కాస్త తగిలితే చాలదూ? చమురు బావి భగ్గుమనదూ?

"పెళ్లికూతురు లక్ష్మీదేవిలా వుంది!" అంటున్నారెవరో.

"కాదు! చమురుబావిలా వుంది!" అంటూ అరిచాను.

ఎవరికీ వినిపించలేదు.

మెల్లగా రూమ్‌కేసి నడిచాను.

*

ఏడాది తర్వాత- ఓరోజు ఉదయాన్నే లైబ్రరీకి వెళ్లాను. పేపరు తడిసి ముద్దైపోయి వుంది.

విపరీతమైన చమురు కంపు!

చమురులో ముంచి, తీసినట్టుగా ఉంది పేపరు.

"చమురు బావుల్ని అంటిచేస్తున్న సద్దాం!" వార్త చదివాను. అదే పేపర్లో జిల్లా ఎడిషన్లో ఫోటోతో సహా మరో వార్త పడింది. ఆసక్తిగా చదివాను. భయంగా చదివాను. నాకు తెలిసున్న వార్తే!

అవును. రూఢిగా కాకపోయినా, ఒక సంవత్సర కాలంలో ప్రచురితమవుతుందని నేననుకున్న వార్తే అది.

ఇందుమతి అనే చమురుబావి భగ్గుమంది.

*ఆంధ్రజ్యోతి వారపత్రిక, 15 మే 1992*